కత్తి నేనే..యుద్ధం నాతోనే!

అగ్ర హీరో విజయ్ దేవరకొండ గురువారం తన జన్మదినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన కొత్త సినిమాలకు సంబంధించిన ప్రకటనలు వెలువడ్డాయి. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు నిర్మాతగా రవికిరణ్ కోలా దర్శకత్వంలో విజయ్ దేవరకొండ ఓ చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా తెరకెక్కనుంది. గురువారం విజయ్ దేవరకొండకు బర్త్‌డే విషెస్ తెలియజేస్తూ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో విజయ్ దేవరకొండ కత్తిపట్టుకొని వయొలెంట్ మోడ్‌లో కనిపిస్తున్నారు.'కత్తి నేనే.. నెత్తురు నాదే.. యుద్ధం నాతోనే' అనే క్యాప్షన్ సినిమాపై ఆసక్తిని పెంచుతున్నది. గ్రామీణ నేపథ్యంలో యాక్షన్ అంశాలతో ఈ సినిమా రూపొందనుంది. ఇక మరో సినిమా వివరాల్లోకి వెళితే.. విజయ్ దేవరకొండ హీరోగా రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నది. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మాతలు. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కనుంది. గురువారం కాన్సెప్ట్ పోస్టర్‌ను విడుదల చేశారు. బీటలువారిన పొలాల మధ్యలో ఓ వీరుడి రాతి విగ్రహం కనిపిస్తుండగా.. దానిపై 'ది లెజెండ్ ఆఫ్ కర్స్' అనే క్యాప్షన్ రాసి ఉంది. 1854 నుంచి 1978 మధ్యకాలంలో జరిగిన యథార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. కొత్తగా ప్రకటించిన ఈ రెండు చిత్రాలు రూరల్ యాక్షన్, పీరియాడిక్ డ్రామా కథాంశాలతో తెరకెక్కనుండటంతో విజయ్ దేవరకొండ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బంపర్ ఆఫర్ కొట్టేసింది

నేషనల్ క్రష్ రష్మిక మందన్న బంపర్ ఆఫర్ కొట్టేసింది. పుష్ప2, యానిమల్ సినిమాలతో పాన్ ఇండియా హీరోయిన్‌గా అవతరించిన ఈ అందాలబొమ్మ.. త్వరలో సల్మాన్‌ఖాన్‌తో జతకట్టనుంది. సల్మాన్‌తో మురుగదాస్ రూపొందిస్తున్న 'సికిందర్' సినిమాలో హీరోయిన్‌గా రష్మికను ఎంపిక చేసి నట్టు మేకర్స్ గురువారం ప్రకటన విడుదల చేశారు. 'మా 'సికిందర్'లో సల్మాన్ ఖాన్ జోడీగా నటించేందుకు రష్మికకు ఆహ్వానం పలుకుతున్నాం. ఈ జంట ఆన్‌స్క్రీన్ మ్యాజిక్ త్వరగా చూడాలని కోరుకుంటున్నాం. వచ్చే ఈద్ పండుగకి సల్మాన్, రష్మిక తెరపై సాక్షాత్కరిస్తారు.' అంటూ ప్రకటనలో పేర్కొన్నారు. దీనిపై తన ఇన్‌స్టాలో రష్మిక స్పందిస్తూ 'నా నెక్ట్స్ సినిమా అప్డేట్ చెప్పమని అభిమానులు తరచూ అడుగుతుంటారు. వారికోసం అద్భుతమైన అప్‌డేట్ ఇస్తున్నా. సల్మాన్‌సార్‌కి జోడీగా 'సికిందర్'లో నటిస్తున్నా. ఈ అవకాశాన్ని గౌరవంగా, గర్వంగా భావిస్తున్నా' అని తెలిపింది నేషనల్ క్రష్.

'కన్నప్ప' సెట్‌లో ప్రభాస్

మంచు విష్ణు టైటిల్ రోల్‌ని పోషిస్తున్న భక్తిరస చిత్రం 'కన్నప్ప' శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. ఈ సినిమాలో అక్షయ్‌కుమార్, మోహన్‌లాల్, శరత్‌కుమార్ వంటి అగ్ర నటులు భాగమవుతున్నారు. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ఈ సినిమాలో కీలక పాత్రలో కనిపించనున్నారు. తాజాగా ఆయన ఈ సినిమా సెట్స్‌లో జాయిన్ అయ్యారు. శ్రీకాళహస్తి స్థలపురాణం ఆధారంగా శివుడి పరమభక్తుడైన కన్నప్ప ఇతివృత్తంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. అచంచలమైన భక్తి భావానికి, విశ్వాసానికి ప్రతీకలా ఈ సినిమా అందరినీ మెప్పిస్తుందని చిత్రబృందం పేర్కొంది. ఈ సినిమాలో ప్రభాస్ మానవరూపంలోని నందీశ్వరుడి పాత్రలో కనిపిస్తారని సమాచారం. ఈ చిత్రానికి ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ప్రభాస్ 'రాజా సాబ్' చిత్రంలో నటిస్తున్నారు. 'సలార్' సీక్వెల్ 'శౌర్యంగపర్వం' ఈ నెలలోనే సెట్స్‌మీదకు వెళ్లనుంది.

గ్యాంగ్‌స్టర్ లంకల రత్న పోరాటం

విశ్వక్‌సేన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్నారు. మే 31న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. దర్శకుడు మాట్లాడుతూ '1960దశకంలో గోదావరి జిల్లాల్లో చీకటి ప్రపంచం నుంచి ఓ సామాన్యుడు అసామాన్యుడిగా ఎదిగిన వైనాన్ని ఈ సినిమాలో చూపిస్తున్నాం. లంకల రత్న అనే గ్యాంగ్‌స్టర్ పాత్రలో విశ్వక్‌సేన్ కనిపిస్తారు. మునుపెన్నడూ చూడని రీతిలో ఆయన పాత్ర సాగుతుంది. విశ్వక్‌సేన్ సరికొత్త మేకోవర్‌లో కనిపిస్తారు. ఇటీవల విడుదల చేసిన టీజర్‌కు మంచి స్పందన లభించింది. 1960 దశకం నాటి వాతావరణాన్ని కళ్లకు కట్టినట్లుగా ఆవిష్కరిస్తూ ఈ సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతినందిస్తుంది' అన్నారు. నేహాశెట్టి, అంజలి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: అనిత్ మాదాడి, ప్రొడక్షన్ డిజైనర్: గాంధీ నడికుడికర్, దర్శకత్వం: కృష్ణచైతన్య.

సైంటిఫిక్ థ్రిల్లర్ 'మాత్రు'

సుగి విజయ్, రూపాలి భూషణ్, శ్రీకాంత్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'మాత్రు'. జాన్ జక్కీ దర్శకుడు. బి.శివప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను ప్రముఖ రచయిత విజయేంద్రప్రసాద్ విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'సైంటిఫిక్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నాం. కథ, కథనాలు ఆసక్తికరంగా సాగుతాయి. కథానుగుణంగా టైటిల్ పెట్టాం. త్వరలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు. అలీ, దేవిప్రసాద్, ఆమని, రవి కాలే, నందిని రాయ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రాహుల్‌శ్రీవాస్తవ్, సంగీతం: శేఖర్‌చంద్ర, నిర్మాణ సంస్థ: శ్రీపద్మినీ మూవీస్, రచన-దర్శకత్వం: జాన్ జక్కీ.

ఎమోషనల్ ఎంటర్‌టైనర్

మోహన్‌భగత్, సుప్రిత సత్యనారాయణ్, భూషణ్‌కల్యాణ్, రవీంద్రవిజయ్ ప్రధానపాత్రధారులుగా రూపొందుతోన్న ఎమోషనల్ థ్రిల్లర్ 'ఆరంభం'. అజయ్ నాగ్ వి. దర్శకుడు. అభిషేక్ వీటీ నిర్మాత. శుక్రవారం ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రీరిలీజ్ ఈవెంట్‌కి హీరో శ్రీవిష్ణు అతిథిగా విచ్చేసి చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. ఇంకా నటుడు తిరువీర్, దర్శకుడు నవీన్ మేడారం, వెంకటేశ్ మహా, నటి శివానీ నాగారం కూడా అతిథులుగా హాజరై యూనిట్‌కి విషెస్ తెలిపారు. ఒక మంచి సినిమా నిర్మించామన్న సంతృప్తితో ఉన్నామని నిర్మాతలు తెలిపారు. ఒక అద్భుతమైన కంటెట్ ఉన్న సినిమాలో భాగం అయినందుకు ఆనందంగా ఉందని నటీనటులు సంతోషం వెలిబుచ్చారు. ఈ చిత్రానికి కెమెరా: దేవ్ దీప్ గాంధీ కుందు, మాటలు: సందీప్ అంగిడి, సంగీతం: సింజిత్ యెర్రమిల్లి,

జీవితంలా అనిపించే సినిమా



'తమిళ నిర్మాత సతీశ్‌తో అనుకోకుండా ఏర్పడ్డ పరిచయం నన్ను నిర్మాతను చేసింది. ఆయన తమిళంలో నిర్మించిన 'రంగోలి' సినిమాను నాకోసం స్పెషల్‌గా స్క్రీనింగ్ వేశారు. ఆ తర్వాత సినిమా ప్రీరిలీజ్ వేడుకకు పిలిచి, 'రంగోలీ' సినిమాకు తెలుగు నిర్మాతగా నన్ను సభాముఖంగా పరిచయం చేశారు. నాక్కూడా సినిమా అద్భుతంగా నచ్చడంతో ఆ సినిమా 'సత్య'గా మీ ముందుకు తెస్తున్నాను. ఓ విధంగా ఇది అనుకోని మలుపు' అని నిర్మాత శివ మల్లాల అన్నారు. హమరేశ్, ప్రార్థన జంటగా, వాలి మోహన్‌దాస్ దర్శకత్వంలో తమిళంలో రూపొందిన 'రంగోలి' సినిమాను 'సత్య' పేరుతో తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు శివ మల్లాల. శుక్రవారం సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో ముచ్చటించారు. 'తెలుగు సినిమానే చూస్తున్న అనుభూతి కలిగేంత పర్‌ఫెక్ట్‌గా డబ్బింగ్ చేశాం. ఏ విషయంలోనూ రాజీ పడలేదు. దర్శకుడు వాలి మోహన్‌దాస్ మంచి ప్రతిభావంతుడైన దర్శకుడు. ఈ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు కూడా చేరువ అవుతాడు. సీడెడ్‌లో 28 థియేటర్లు విడుదల చేస్తున్నాం. పీవీఆర్, ఐనాక్స్, సినిమాక్స్ తదితర థియేటర్లలో కూడా భారీగా విడుదలకు ప్లాన్ చేస్తున్నాం' అని తెలిపారు. టీనేజ్ లవ్, తండ్రీకొడుకుల భావోద్వేగాలు ఈ సినిమాకు హైలైట్‌గా నిలుస్తాయని, ఒక జీవితాన్ని చూస్తున్న అనుభూతిని కలిగించే సినిమా ఇదని శివ తెలిపారు.

కృష్ణమ్మ మలుపులు

సత్యదేవ్ ప్రధానపాత్రలో తెరకెక్కిన చిత్రం 'కృష్ణమ్మ'. వి.వి.గోపాలకృష్ణ దర్శకుడు. కృష్ణ కొమ్మలపాటి నిర్మాత. అగ్రదర్శకుడు కొరటాల శివ ఈ చిత్రానికి సమర్పకుడిగా వ్యవహరిస్తుండటం విశేషం. శుక్రవారం సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. సత్యదేవ్ మాట్లాడుతూ 'ఇదొక గొప్ప స్క్రిప్ట్. అద్భుతమైన సినిమాను చూశామన్న అనుభూతితో ప్రేక్షకులు బయటకి వస్తారు. దర్శకుడిగా గోపాలకృష్ణకు ఇది తొలి సినిమానే అయినా పది సినిమాల అనుభవం తెరపై కనిపిస్తుంది. ఇలాంటి కథను నాకిచ్చినందుకు తనకు థ్యాంక్స్ చెప్పుకుంటున్నాను. భవిష్యత్‌లో తను గొప్ప దర్శకుడవుతాడు. పేషన్‌తో ఈ సినిమాను నిర్మించారు కృష్ణ కొమ్మలపాటి. కొరటాల శివగారు సమర్పకుడు కావడంతో సినిమాపై అంచనాలు పెరిగాయి. సాంకేతికంగా నెక్ట్స్ లెవల్లో ఉంటుందీ సినిమా.' అన్నారు. కొత్త విజయవాడను ఈ సినిమాలో చూస్తారని, బెజవాడ పాలిటిక్స్, రౌడీయిజం ఇందులో కనిపించదని, బెజవాడ కుర్రాళ్లలోని దుడుకుతనం, అమాయకత్వాలను ఆధారంగా చేసుకొని ఈ కథ రాసుకున్నానని, కృష్ణమ్మ ప్రవాహంలో ఎన్ని మలుపులు ఉంటాయో, ఈ సినిమాలో హీరో జీవితం కూడా అన్ని మలుపులు ఉంటాయని దర్శకుడు చెప్పారు. కథానాయికలు అతీర, అర్చన తదితరులు మాట్లాడారు.

నా లవ్‌స్టోరీ బ్లాక్‌బస్టర్ అయ్యిందే..

కార్తికేయ గుమ్మకొండ హీరోగా రూపొందుతోన్న చిత్రం 'భజే వాయువేగం'. ఐశ్వర్య మీనన్ కథానాయిక. రాహుల్ టైసన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రశాంత్‌రెడ్డి చంద్రపు దర్శకుడు. ప్రతిష్మాత్మక యూవీక్రియేషన్స్ సమర్పిస్తున్న ఈ చిత్రం ఈ నెల 31న విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమాకు చెందిన తొలి లిరికల్ సాంగ్‌ని గురువారం మేకర్స్ విడుదల చేశారు. 'సెట్ అయ్యిందే.. లైఫ్ సెట్ అయ్యిందే.. నీ వల్లే నా లైఫ్ సెట్టయ్యిందే.. సెట్ అయ్యిందే.. లైఫ్ సెట్టయ్యిందే.. నా లవ్‌స్టోరీ బ్లాక్‌బస్టర్ అయ్యిందే' అంటూ సాగే ఈ పాటను రామజోగయ్యశాస్త్రి రాయగా, రధన్ స్వరపరిచారు. రంజిత్ గోవింద్ ఆలపించారు. హోలీ సంబరాల నేపథ్యంలో కలర్‌ఫుల్‌గా ఈ పాటను చిత్రీకరించినట్టు మేకర్స్ తెలిపారు. ఈ గీతంలో కార్తికేయ, ఐశ్వర్యమీనన్ చేసిన హుక్‌స్టెప్ పాటకే హైలైట్‌గా నిలుస్తుందని వారు అన్నారు. తనికెళ్ల భరణి, రవిశంకర్, శరత్ లోహితస్వ ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి మాటలు: మధు శ్రీనివాస్, కెమెరా: ఆర్.డి.రాజశేఖర్.సహనిర్మాత: అజయ్‌కుమార్‌రాజు.పి.

ఓటు విలువ తెలియజెప్పే 'కమిటీ కుర్రోళ్లు'

ఓట్లు కొనేసిన తర్వాత ప్రజలకు మంచి చేయని రాజకీయ నాయకులను నమ్మొద్దంటూ, గొర్రెల్లా కాకుండా మంచిచెడులను విశ్లేషించుకొని ఓటు వేయాలనే సందేశంతో రూపొందిస్తున్న చిత్రం 'కమిటీ కుర్రోళ్లు'. యదువంశీ దర్శకుడు. నిహారిక కొణిదెల సమర్పణలో శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ సంస్థ నిర్మిస్తున్నది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలో విడుదలకానుంది. ఇటీవలే ఈ సినిమాలోని 'గొర్రెలా..' అంటూ సాగే సెటైరికల్ గీతాన్ని జయప్రకాష్ నారాయణ్ విడుదల చేశారు. అనుదీప్‌దేవ్ స్వరపరచిన ఈ పాటను నాగ్ అర్జున్‌రెడ్డి రాశారు. ఈ సందర్భంగా జయప్రకాష్ నారాయణ్ మాట్లాడుతూ.. ఓటు విలువ తెలియజేస్తూ ఆలోచనాత్మకంగా ఈ పాటను రూపొందిచారని, యువత ఓటు వేసే సమయంలో సరైన నిర్ణయం తీసుకోవాలనే సందేశం ఉందని అన్నారు.

సందేశంతో 'ప్రేమించొద్దు'

అనురూప్‌రెడ్డి, దేవా మలిశెట్టి, సారిక, మానస ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ప్రేమించొద్దు'. శిరిన్ శ్రీరామ్ దర్శకుడు. పాన్ ఇండియా స్థాయిలో ఐదు భాషల్లో విడుదల చేయబోతున్నారు. తెలుగు వెర్షన్ జూన్ 7న రిలీజ్ కానుంది. దర్శకనిర్మాత శిరిన్ శ్రీరామ్ మాట్లాడుతూ 'బస్తీ నేపథ్య ప్రేమ కథ ఇది. నేటి యువత ప్రేమకు, ఆకర్షణకు తేడా తెలుసుకోకుండా తప్పటడుగులు వేస్తున్నారు. అది వారి జీవితాలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నది. ఈ అంశాన్ని చర్చిస్తూ ఈ సినిమాను తెరకెక్కించాం. వాస్తవ సంఘటనల ఆధారంగా కథ రాసుకున్నా' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: హర్ష కొడాలి, సంగీతం: జునైద్ కుమార్, రచన, ఎడిటింగ్, నిర్మాత, దర్శకత్వం: శిరిన్ శ్రీరామ్.